

రేపు ఉపకరణాల పంపిణీ

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 3వ తేదీన ఉదయం 10.30గంటలకు విభిన్న ప్రతిభా వంతులకు అవసరమైన ఉపకరణాల పంపిణీ చేయనున్నట్టు ఆ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే గత నెల 20న విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులందరూ ఈ వేడుకలకు హాజరు కావాలని కోరారు.

వీడని వర్షం

- తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరిపంట
- రంగుమారుతున్న ధాన్యం
- అన్నదాతల్లో కలవరం

నరసన్నపేట/ టెక్కలి/ వజ్రపుకొత్తూరు/ ఎల్.ఎన్.పేట/ హరిపురం/ నందిగాం/ గార/ సోంపేట/ హిరమండలం/ పోలాకి/ పలాసరూరల్/ మెళియాపుట్టి/ గుజరాతీపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్.. రైతులను నట్టేట ముంచింది. తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మూడురోజులుగా వర్షం జల్లుజల్లులుగా కురుస్తూనే ఉంది. వేలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. అలాగే కళ్లాల్లో ధాన్యం రాశుల కిందకు వర్షపునీరు చేరింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పొలాల్లో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు పొలాల్లోనే వరి కుప్పలు పెట్టి వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పారు.

● జిల్లాలో టెక్కలి, నరసన్నపేట, నందిగాం, పోలాకి, జలుమూరు, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, సారవకోట తదితర మండలాల్లో ధాన్యం రాశులు కళ్లాల్లో.. రోడ్ల మీద దర్శనమిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లు పడటంతో సుమారు 30వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం రంగు మారే అవకాశం ఉంది. దీంతో ఏమిచేయాలో తెలియక రైతులు సతమత మవు



సోంపేటలో..



బలగ సమీప పొలంలో నీటిని మళ్లించి.. వరిచేనును కట్టలు కడుతున్న రైతులు



వజ్రపుకొత్తూరు : సీతాపురంలో..


తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో గుల్లలపాడు, సీతాపురం, ఎల్.ఎన్.పేట మండలంలో దబ్బపాడు, వాడవలస, తురకపేట, ధనుకువాడ, రావిచెంద్రి, చింతలబడవంజ, కృష్ణాపురం, పూశాం, కొత్తపేట, డొంకలబడవంజ, కుసుములపాడులో వరి ఓదెలు నీటిలో నానుతున్నాయి. గింజలు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మందస మండలం బిన్నల, మఖరజోల, మందస, ఉమాగిరి, పితాతొళి, సిరిపురం పొలాల్లోనే కుప్పలు పెట్టి తడిసిపోకుండా కాపాడుకుంటున్నారు. హరిపురం, బాలిగాం, కొత్తపల్లి, కుంటికోట, జీఆర్‌పురం, పొత్తంగి గ్రామాల్లో కళ్లాల్లోనే ధాన్యం ఉన్నాయి. గార మండలం బందరువానిపేట వద్ద సముద్రపు అలలు ఎగసి పడుతున్నాయి. వత్సవలస, జాఫ్రబాద్, తూలుగు గ్రామాల్లో కోతకోసిన పంట తడిసిపోయింది. పోలాకి మండలం రామయ్యవలస, సుసరాం, చెల్లాయివలస, డోల, పల్లిపేట, వనితమండలం, మొగివిల్లిపేట, అంబీరుపేట, చెల్లాయివలస, సత్రవుపేట గ్రామాల పరిధిలోని రైతులు వర్షాలకు ఆందోళన చెందుతున్నారు. పలాస మండలం రెంటికోట, అల్లుకోల, సవరగోవిందపురం, సుబ్బుగుడ్డి, మహాదేవపురం, కైజోల, సున్నాడ, దానగొర, హిమగిరి, లక్ష్మీపురం, గోపాలపురం, బ్రాహ్మణతర్లా, కేశుపురం గ్రామాల్లో వరి పంట తడిచి ముద్దయింది. తేమ శాతంలో సడలింపు ఇచ్చిన మాదిరి.. ప్రభుత్వం రంగు మారిన ధాన్యం కొనుగోలుకు అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



మెళియాపుట్టిలో ధాన్యం తడవకుండా పరదా కప్పుతున్న రైతులు



ఎల్.ఎన్.పేటలో..



టెక్కలిలో..



సౌదీఅరేబియాలో తాము పడుతున్న బాధలను వివరిస్తున్న జిల్లా యువత

తిండీ లేదు.. నిద్రా లేదు

- సౌదీ అరేబియాలో జిల్లా యువకుల పాట్లు
- ఉపాధి కోసం వెళ్లి అవస్థలు
- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- పట్టించుకోని కంపెనీలు, ఏజెన్సీలు
- తమను స్వగ్రామాలకు తీసుకెళ్లాలని వేడుకోలు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లిన సిక్కోలు యువకులు.. అక్కడ సక్రమంగా జీతాలు అందక పడరాని పాట్లు పడుతున్నారు. చేతిలో డబ్బులు లేక.. తినేందుకు తిండి దొరక్క అల్లాడిపోతున్నారు. అక్కడి నుంచి తమకు విముక్తి కల్పించాలని, స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు వారి ఆవేదనను ఓ వీడియో రూపంలో సామాజిక మాధ్యమాల ద్వారా కుటుంబ సభ్యులకు పంపించారు. దేశం కాని దేశంలో తమ పిల్లలు పడుతున్న ఇబ్బందులను ఆ వీడియోలో చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాలకు చెందిన 30 మంది యువకులు ఉపాధి కోసం నాలుగు నెలల కిందట సౌదీఅరేబియా దేశం వెళ్లారు. వీరంతా వజ్రపుకొత్తూరు మండలం పూండి, ఇచ్ఛాపురానికి చెందిన ఏజెన్సీలకు సొమ్ములు చెల్లించి.. సౌదీ అరేబియా వెళ్లారు. అక్కడ ఓ కంపెనీలో ఉద్యోగానికి చేరారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఆ కంపెనీ జీతాలు చెల్లించలేదు. దీంతో డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని యువకులు వాపోయారు. ఓ వీడియో ద్వారా తమ ఆవేదనను కుటుంబ సభ్యులకు పంపారు. 'ఇక్కడ సరైన వసతి, భోజన సదుపాయం లేదు. కంటినిండా నిద్ర పట్టడం లేదు. మా దగ్గర డబ్బులు తీసుకుని విదేశానికి పంపించిన ఏజెన్సీలను అడిగితే.. తమకు సంబంధం లేదని చెబుతున్నారు. విదేశాలకు పంపడం వరకే తమ బాధ్యత అంటున్నారు. జీతాల కోసం కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించినా సరైన సమాధానం రావడం లేదు. కనీసం మమ్మల్ని ఇండియా పంపించేయండి అడగ్గా.. 10వేల దినారులు (సౌదికరెన్సీ) చెల్లిస్తేనే పంపిస్తామని చెబుతున్నారు. చేతిలో డబ్బులు లేక ఇక్కడ నుంచి ఎలా బయటపడాలో తెలియడం లేదు' అని కన్నీటి పర్యంతమయ్యారు. తమను ఇబ్బందుల నుంచి రక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వారి ఇబ్బందులను వీడియోలో చూసిన తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇటీవల విదేశీ ఉద్యోగాల పేరిట మోసపోతున్న అనేక సంఘటనలు వెలుగుచూస్తున్నా.. నకిలీ ఏజెన్సీలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సౌదీలో ఇబ్బందులు పడుతున్న యువకులను స్వదేశానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నకిలీ కంపెనీలలో ఉద్యోగాలు ఇచ్చిన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలం చెల్లిన మందులే

- ఆయుర్వేద దుకాణాల్లో నిబంధనలు తూచ్
- ఇష్టానుసారంగా విక్రయాలు..
- అసలువో.. నకిలీవో ఎవరూ పోల్చలేని వైనం
- విజిలెన్స్ అధికారుల తనిఖీలో బయటపడిన అక్రమాలు



శ్రీకాకుళం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా వ్యాధులు నయమవుతాయని కొంతమంది ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని కొంతమంది వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. కాలం చెల్లిన మందులు, నకిలీవి విక్రయించి.. రోగులను దోచుకుంటున్నారు. అధికారులు ఏడాదికి ఓసారైనా తనిఖీలు చేపట్టకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కాగా.. ఇటీవల ఈ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. తనిఖీల్లో అక్రమాలు బయటపడడం చర్చనీయాంశమవుతోంది.

● రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23 నుంచి 27 వరకు ఆయుర్వేద ముందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళంలోని నెహ్రూ రోడ్‌లో రెండు దుకాణాల్లో ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన మందులను విక్రయిస్తున్నారు. ఈ రెండు దుకాణాల్లో విజిలెన్స్ డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రరావు, విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రామారావు బృందంగా ఏర్పడి ఇటీవల సోదాలు నిర్వహించారు. రెండు దుకాణాల్లోనూ కాలం చెల్లిన మందులు కొన్ని లభించాయి. ఫిజీషియన్ శాంపిల్స్ కనిపించాయి. వీటిని సీజ్ చేశారు. అలాగే వినియోగదారులు కొనుగోలు చేస్తున్న మందులకు బిల్లులు ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. దీనిపై రాష్ట్ర అధికారులకు నివేదిక పంపారు. ఈ వ్యవహారంపై కార్పొరేషన్, ఆహార కల్తీ నియంత్రణ, ఆయుష్ అధికారులు చర్చించి.. రెండు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు.

● ఏడాదికోసారైనా తనిఖీలు లేవు..

ఇటీవల ప్రతి మండలం.. పట్టణాల్లోనూ ఆయుర్వేద మందుల దుకాణాలు వెలుస్తున్నాయి. అయితే ఈ దుకాణాల్లో విక్రయిస్తున్న మందుల నాణ్యత విషయం దేవుడికే ఎరుక. ప్రముఖ ఆయుర్వేద బ్రాండ్‌లకు చెందిన హిమాలయ, చరక్, బైద్యనాథ్, ఆయుర్, పతాంజలి.. సంస్థలకు చెందిన ఆయుర్వేద మందులను కొనుగోలు చేయాలన్నా.. కచ్చితంగా క్వాలిఫైడ్ ఆయుర్వేద వైద్యులే సూచించాలి. వారే మందుల చీటీ రాయాలి. కానీ జిల్లాలో ఇది ఎక్కడా అమలుకావడం లేదు. దుకాణాల నిర్వాహకులే.. 'సంప్రదాయ వైద్యం' అంటూ మందులు విక్రయిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులతోనూ కుమ్మక్కవుతున్నారు. రోగులను తమ దుకాణాలకే పంపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాదికోసారైనా అధికారులు దుకాణాల్లో తనిఖీ చేసిన దాఖలాలు లేవు. అక్కడ విక్రయిస్తున్న మందులు.. నిల్వచేస్తున్న పద్ధతులను కూడా ఆయుష్ కమిషనర్ స్థాయిలో చర్చ జరగడంలేదు. జిల్లాకు ఓ అధికారి అంటూ ఆయుర్వేద మందుల దుకాణాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఎవరూ లేకపోవడంతో.. నిర్వాహకుల ఇష్టారాజ్యం సాగుతోంది. వినియోగదారుడు కొనుగోలు చేసిన మందులకు బిల్లులూ ఇవ్వడం లేదు. పైగా.. దుకాణాల్లో వినియోగించే తూనిక యంత్రానికి కూడా లైసెన్స్ (లీగల్ మెట్రాలజీ నుంచి) లేకపోవడం దారుణం. ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఆహారకల్తీనియంత్రణ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ.. వంటి శాఖలన్నీ తరుచూ ఆయుర్వేద దుకాణాలపై నిఘా సారిస్తే.. వాటి వెనుక అక్రమాలు వెలుగులోకి వస్తాయి. ప్రస్తుతం ఆయుర్వేద దుకాణాల్లో విక్రయిస్తున్న మందులు ఇటు అల్లోపతి కంటే హెచ్చుమీరిన ధరలున్నా.. కొంతమంది నమ్మకంతో వాడుతున్నారు. మందుల్లో నాణ్యత పరీక్షలు జరగాలని... కంపెనీల మందులను అధికారులు పరిశీలించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఊరట

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన మెనూ చార్జీలు
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల్లో హర్షం

పొందూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు పంపింది. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా.. మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచింది. డిసెంబరు 1 నుంచి కొత్త మెనూ ధరలు అమలు చేయాలని ఇటీవల ఆదేశించింది. దీంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందనుంది. నిర్వాహకులకు ఊరట లభించనుంది. జిల్లాలో 11,955 ప్రభుత్వ ప్రాథమిక, 2,069 ప్రాథమికోన్నత, 414 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తంగా 1,71,575 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాయి. కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో మెనూ ధరలను పెంచింది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.88, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.8.57 చొప్పున నిర్వాహకులకు నిధులు అందజేస్తోంది. కాగా.. ప్రస్తుతం మార్కెట్‌లో పప్పులు, నూనె, కూరగాయలు, ఇతర నిత్యావసర ధరలన్నీ పెరిగాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, మెనూ చార్జీలు పెంచాలని నిర్వాహకులు కొన్నాళ్ల నుంచీ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మెనూ చార్జీలు స్వల్పంగా పెంచింది. ఇకపై ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.6.19, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.9.29 చొప్పున అందించనుంది. దీంతో విద్యార్థులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అప్రమత్తతతో ఎయిడ్స్‌ను అరికడదాం

- వ్యాధిగ్రస్తులకు అండగా నిలవాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్రమత్తంగా ఉందాం.. ఎయిడ్స్‌ను అరికడదామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం స్థానిక అంబేద్కర్ కళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. అప్రమత్తతతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమన్నారు. రక్తమార్పిడి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎయిడ్స్ పాజిటివ్ బాధితులు తప్పనిసరిగా చికిత్స తీసుకుంటూ మందులు వాడాలని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని, వారిలో మనోధైర్యం నింపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షి పాల్గొన్నారు.

లోతుగా విచారణ

- పోలిపల్లి వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు

భోగాపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపం జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణాలను విశ్లేషించేందుకు జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డి.మణికుమార్, జాతీయరహదారి ఇంజనీర్ మల్లిఖర్జునరావు, మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సీఐ ఎస్వీ ప్రభాకర్ ఆదివారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాద ఘటనలో శ్రీకాకుళం నగరానికి చెందిన గొడి వెంకటరమణ కౌశిక్(27), మెడి జయేశ్(20), వడ్డి మణిబాల(24), వడ్డి అభినవ్(27) అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా.. కారు ఎక్కడ డివైడర్ ఎక్కింది... డివైడర్ ఏ విధంగా పగిలింది... టైర్ పంక్చర్ అయి డివైడర్ ఎక్కి అవతలి రోడ్డుపైకి వెళ్లిందా లేక లారీని ఢీకొన్న తరువాత టైర్ పంక్చర్ అయిందా... డివైడర్ సమీపంలో నీరు ఏమాత్రం నిల్వ ఉంది.. కారు వేగం, స్టీరింగ్ సమస్య ఉందా, తదితర అంశాలపై అధికారులు చర్చించారు. నుజ్జునుజ్జయిన కారును అనువణువూ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. కాగా జాతీయరహదారిపై వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎన్‌హెచ్ అధికారులకు ఆదివారం ఫోన్‌లో సూచించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద కూడా రోడ్డుపై అధికంగా నీరు నిల్వ ఉంటోందన్నారు.



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న అధికారులు

కొబ్బరి నీళ్లు తాగేద్దాం!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలుసు. వేసవికాలంలోనే కాదు చలికాలంలో కూడా తాగవచ్చు. కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ఖనిజాలు, మినరల్స్ అందుతాయి. చలికాలంలో కొబ్బరి నీళ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



చర్మానికి : చలికాలంలో కొబ్బరినీళ్లు తరచూ తాగడం వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల చర్మం పొడారిపోకుండా మృదువుగా ఉంటుంది. ముఖంపై పగుళ్లు, మొటిమలు రాకుండా ఉంటాయి. రాత్రి పడుకునేముందు ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడిగితే మచ్చలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

రోగనిరోధక శక్తి: కొబ్బరి నీళ్లలో రెబోఫ్లెవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్ విటమిన్లతోపాటు యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తితోపాటు ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని అందిస్తాయి. చలికాలంలో తరచూ వేధించే అనేక అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రొలైట్లు శరీరాన్ని ఉత్తేజితం చేసి చలికాలంలో వచ్చే బద్ధకాన్ని పోగొడతాయి.

బరువు : కొబ్బరి నీళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. పీచు పదార్థాలు, పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొబ్బరి నీళ్లు తాగిన వెంటనే చాలా సమయం వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల త్వరగా ఆహారం తీసుకోవాలని అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజూ కొబ్బరినీళ్లు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియ : కొబ్బరినీళ్లు తాగడం వల్ల కడుపులో ప్రేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మలబద్ధకం సమస్య రాదు. కొబ్బరి నీళ్లలోని ఆల్కలీన్ గుణాలు పొట్టలో పీహెచ్ స్థాయిని తటస్థం చేస్తాయి. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావు. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం శరీరంలోని అదనపు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. రక్తపోటుని నియంత్రిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా కాపాడుతుంది.

గుండె : తరచూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయులు తగ్గుతాయి. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం శరీరంలో ఇన్సులిన్ పనితీరుని మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

శక్తి : చలికాలంలో వ్యాయామం చేసిన తరవాత లేదంటే ఆటలు ఆడిన తరవాత శరీరానికి నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇటువంటి సమయంలో వెంటనే కొబ్బరి నీళ్లు తాగితే శారీరక శ్రమ నుంచి ఉపశమనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్లు, ఖనిజ లవణాలు తక్షణ శక్తిని అందిస్తాయి.

సి విటమిన్ లోపిస్తే...

విటమిన్ 'సి' మన ఆరోగ్యానికి అత్యవసరమైన పోషకం. రోగనిరోధక శక్తిని పెంచడంలో దీని పాత్ర కీలకం. గుండె, చర్మం, ఎముకలు, కండరాలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన శరీరంలో విటమిన్ 'సి' లోపిస్తే వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం.



రక్తహీనత : మనం తీసుకునే ఆహారపదార్థాల నుంచి ముఖ్యంగా శాకాహారం నుంచి ఐరన్‌ను గ్రహించడంలో శరీరానికి సి విటమిన్ సహాయం తప్పనిసరి. విటమిన్ సి తగిన పరిమాణంలో లేని పక్షంలో శరీరానికి ఐరన్ అందక రక్తం ఉత్పత్తి కాదు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. శాకాహారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులు : సి విటమిన్ లోపించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పలు రకాల అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటివి తరచూ వేధిస్తుంటాయి.

ఎముకలు విరగడం : ఎముకలు బలంగా ఉండేందుకు కావాల్సిన కాల్షియాన్ని శరీరం సంగ్రహించేందుకు సి విటమిన్ తోడ్పడుతుంది. దీని లోపం వల్ల శరీరం కాల్షియాన్ని శోషించుకోలేదు. ఫలితంగా ఎముకలు బలహీనమై ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే ఎముకలు విరిగిపోతుంటాయి. గోళ్లు పెళుసుగా మారతాయి.

కండరాలు బలహీనం : సి విటమిన్ లోపిస్తే శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రోటీన్ ఉత్పత్తి కాదు. దీంతో కండరాలు, ఎముకల మధ్య అనుసంధానం దెబ్బతింటుంది. రక్తనాళాల గోడలు బలహీనమై కండరాల్లో వాపుని నొప్పిని కలిగిస్తాయి. గాయాలు తొందరగా నయం కావు.

దృష్టి దోషాలు : శరీరానికి సి విటమిన్ అందకపోతే తొందరగా వార్ధక్య లక్షణాలు ఎదురవుతాయి. కంటిచూపును అందించే రెటీనాలో ప్రధాన భాగమైన మాక్యులాలో అసాధారణ స్రావాలు విడుదలవుతాయి. దీంతో మాక్యులా పొరలు ఉబ్బి కంటి చూపు మందగిస్తుంది. రంగులను గుర్తించడం కష్టమవుతుంది.

అలసట: సి విటమిన్ లోపం కారణంగా శరీరంలో శక్తి ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో శరీరానికి కావాల్సిన శక్తి లభించక ఎప్పుడూ నీరసంగా, బలహీనంగా అనిపిస్తుంది. ఎంత బలమైన ఆహారం తీసుకున్నప్పటికీ అలసటగా, మత్తుగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరక మానసిక సమస్యలు ఏర్పడతాయి.

నోటి సమస్యలు: విటమిన్ సి లోపం వల్ల దంతాలు, చిగుళ్లు బలహీనమవుతాయి. డెంటిన్ అనే పదార్థం ఏర్పడక పోవడంతో దంతాల్లోని రక్తనాళాలు పెళుసుగా మారతాయి. పళ్లు తోముతున్నపుడు కలిగే చిన్నపాటి ఒత్తిడికే రక్తనాళాలు చిట్లి చిగుళ్ల నుంచి రక్తం స్రవిస్తుంది. చిగుళ్లలో వాపు, నొప్పి కూడా బాధిస్తుంటాయి.

సినీ కుటుంబ నేపథ్యం. కానీ పరిశ్రమ వైపు వెళ్లలేదు. సంగీత సాగరంలో తనకంటూ కొన్ని తీపి గుర్తులు ఉండాలనే తాపత్రయం. అందుకే మూడు దశాబ్దాలుగా స్వర సంగమంలో మునిగిపోయారు. వేదికలెక్కి... వేల ప్రదర్శనలు ఇచ్చి... ప్రతిష్ఠాత్మక 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం' అందుకున్నారు. అలనాటి ప్రముఖ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలు... కర్ణాటక సంగీత కళాకారిణి... శ్వేతా ప్రసాద్‌తో 'నవ్య' ముచ్చట్లు.



సుస్వర సంగీత ఝరి

"ఒకరి పేరు చెప్పుకొని కాదు... మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనేది నా అభిమతం. అందుకు నేను ఎంచుకున్న మార్గం సంగీతం. మూడేళ్లప్పుడు మొదలుపెట్టాను. మూడు దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నాను. సరిగమల ప్రవాహంలో సాగిపోతున్నాను. దానికి ప్రతిఫలమే ఇటీవల నేను అందుకున్న 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం'. నాకు 2022 సంవత్సరానికి గానూ కర్ణాటక సంగీతంలో వచ్చింది. ఢిల్లీలో 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. యువ కళాకారులకు ఇది 'పద్మశ్రీ'తో సమానం. స్వయంకృషితో ఎదిగి, ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉంది. ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

సంగీత జ్ఞానం ఉన్నవారే...

సంగీతాభిరుచి నాకు మా నాయనమ్మ శశిరేఖ నుంచి వచ్చింది. ఆవిడ కర్ణాటక సంగీతం చాలా బాగా ఆలపిస్తారు. మా తాత నాగభూషణం గారి 'రక్తకన్నీరు' నాటకానికి చాలా ఏళ్లు నాయనమ్మ పాడేవారట. నాన్న రవీంద్రనాథ్‌ది మేనరికం. మా అమ్మ ప్రసన్నకు మేనత్తే మా నాయనమ్మ. అమ్మ వైపు అందరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. ఒకరు వయొలిన్ వాయించేవాళ్లు. ఒకరు హార్మోనియం... మరొకరు గాత్రం. కాకపోతే ఎవరూ ఎక్కడా నేర్చుకోలేదు. అలా నాకూ నాయనమ్మ వారసత్వం వచ్చింది. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సంగీతంలో రామలక్ష్మి రంగాచారి గారు నా తొలి గురువు. ఐదారేళ్ల తరువాత నేతి శ్రీరామ్ గారి వద్ద శిష్యరికం చేశాను. మొత్తం పదహారేళ్లపాటు సంగీతం నేర్చుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీకాం తరువాత ఎంఏ మ్యూజిక్ చదివాను. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఎంఫిల్ చేస్తున్నాను.

పిలిచి పాడించేవారు...

పదో ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలకు పాడేదాన్ని. మా తాతగారిని కలవడానికి పెద్ద పెద్ద నటులు, నాయకులు ఇంటికి వచ్చేవారు. నన్ను పిలిచి... 'ఇది నా మనవరాలు. బ్రహ్మాండంగా పాడుతుంది... వినండి' అని నాతో వాళ్ల ముందు పాడించేవారు. ఎక్కువగా కమ్యూనిస్టు పాటలు పాడమనేవారు. నాయనమ్మకు పక్షవాతం వచ్చి పన్నెండేళ్లు మంచం మీదే ఉన్నారు. అప్పట్లో తను సొంతంగా రాసుకున్న గీతాలు నేను పాడి వినిస్తుంటే ఎంతో ఉద్వేగానికి లోనయ్యేవారు. తాత కూడా కన్నీళ్లు పెట్టుకొనేవారు.

ఆ ఇద్దరూ భలే ఇష్టం...

తాత గారికి ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఇక మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు కౌశిక్ హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, అదే రంగంలో స్థిరపడ్డాడు. చిన్నప్పుడు తాతయ్య మాతో చాలా సరదాగా గడిపేవారు. మా మధ్య చాలా సంభాషణలు జరిగేవి. 'రోజూ మేకప్ వేసుకొని తీయాలంటే చికాగ్గా ఉండదా' అని అడిగితే... 'అవునే..! మేకప్ కోసం తెల్లవారుజాము మూడింటికి లేచేవాడిని. మంచం మీద పడుకొంటే ముఖానికి రంగు వేసేసేవాళ్లు' అనేవారు నవ్వుతూ. నచ్చిన నటులు ఎవరని అడిగేవాళ్లం. ఆయన ఎప్పుడూ జయప్రద గారి గురించి గొప్పగా చెప్పేవారు. 'ఏంటోనే... ఆ అమ్మాయిని చూస్తుంటే అమ్మవారిలా అనిపిస్తుంది. ఏం అందం ఆ అమ్మాయిది' అనేవారు. ఆవిడ కూడా తాతయ్యను ఆప్యాయంగా 'డాడీ' అని పిలిచేవారు. అలాగే సూర్యకాంతం గారి వ్యక్తిత్వం ఆయనకు బాగా నచ్చేది. ఇద్దరూ 'ఒరేయ్ అన్నయ్యా' అంటే 'ఒరేయ్ అన్నయ్యా' అని పిలుచుకొనేవారట. ఆవిడ మహా సరదా మనిషట. షూటింగ్‌లో కాస్త ఖాళీ దొరికితే చాలు... 'ఒరేయ్ అన్నయ్యా... రా ఆడుకొందాం' అని ఎడం చేత్తో పేక ముక్కలు అలా వేసిపడేసేవారట. ఫ్రీగా ఆడమంటే అస్సలు ఒప్పుకోనేవారు కాదుట. డబ్బులకు తప్ప ఆడేవారు కాదుట. ఇంట్లో అందరికీ వండి పెట్టడమంటే సూర్యకాంతం గారికి మహా ఇష్టమని చెప్పేవారు తాతయ్య.

ఎందుకో ఒప్పుకోలేదు...

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా మా తాత చనిపోయారు. ఎందుకో తెలియదు... ఆయన తన పిల్లలు ఎవర్నీ సినిమాల్లోకి రానీయలేదు. నేను పుట్టేనాటికి... అంటే 1983కు ముందే పరిశ్రమతో సంబంధాలు తెంచుకుని హైదరాబాద్‌కు వచ్చేశారు. మా నాన్న కోసం దాసరి నారాయణరావు తదితరులు బోలెడన్ని కథలు రాసుకున్నారు. 'రవిబాబు కోసం నేను ఈ కథ రాసుకున్నా. బాబును నాకు వదిలెయ్... ఐదేళ్లలో సూపర్‌స్టార్‌ను చేస్తా' అనేవారు దాసరి. నాన్నది మంచి పర్సనాలిటీ. చూడ్డానికి చాలా బాగుంటారు. అయితే తాత గారు ససేమిరా అన్నారు. 'ఏమైనా చెప్పండి. అటువైపు నా పిల్లలను పంపించను' అని తెగేసి చెప్పేవారట. నేను కూడా కీరవాణి, కోటి, మణిశర్మ గార్ల సినిమాలకు పదేళ్లపాటు కోరస్ పాడాను. అదికూడా తాతకు నచ్చేది కాదు. 'ఎందుకు పంపిస్తున్నావురా పిల్లని' అని నాన్నపై కోప్పడేవారు. నలభై ఏళ్లకు పైగా పరిశ్రమలో ఉన్న ఆయన అంత కచ్చితంగా చెబుతున్నారంటే ఆలోచించాలి కదా!

వేల ప్రదర్శనలు...

ప్రస్తుతం నాకు, మావారు రేణుకా ప్రసాద్‌కు సంగీతమే వృత్తి. ఇదే మా జీవితం. ఆయన మృదంగం వాయిస్తారు. నట్టువాంగం చేస్తారు.



అమ్మవల్లే ఇక్కడివరకు...

"సంగీతంలో నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే కారణం. చిన్నప్పుడు సంగీత తరగతులకు వెళ్లనని ఏడ్చేదాన్ని. అయినా అమ్మ వినేది కాదు. 'నీకు భగవంతుడు మంచి గొంతు ఇచ్చాడు. నువ్వు ఏమైనా చెయ్యి. క్లాస్‌కు వెళ్లాల్సిందే' అనేది. ఎక్కడ పోటీలున్నా వెంటబెట్టుకుని తీసుకువెళ్లేది. నేను సంగీతం నేర్చుకోవడానికి ఏంకావాలన్నా చేసేది. పెళ్లయ్యాక మావారు, అత్తగారు కూడా అంతే ప్రోత్సహించారు. అమ్మ ప్రేరణ, అత్తింటివారి సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది."

తాతగారి కోసం రాస్తే...

'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు గారు పోషించిన పాత్రను వాస్తవానికి బాపూ గారు తాతయ్య కోసం రాసుకున్నారు. ఎంత అడిగినా 'నేను చేయాలనుకోవడంలేదు' అని తాత చెప్పేశారు. సినిమాలు వదిలేసినప్పుడు చెన్నైలో ఆస్తులన్నీ అమ్మేసుకుని ఇక్కడ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పటికీ ఆయన పిల్లలు ఎవరికీ తెలియదు. ప్రస్తుతం మాకు పరిశ్రమలో ఎవరితో సంబంధాలు లేవు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నాకు కజిన్ అవుతాడు. వాళ్లమ్మ శాలిని గారు, మా అమ్మ కజిన్ సిస్టర్స్. చిన్నప్పుడు తారక్ కూచిపూడి నాట్యానికి నేను గాత్ర సహకారం అందించేదాన్ని. ఇప్పుడు అతను బాగా బిజీ అయిపోయాడు. వాళ్లమ్మకు, మా అమ్మకు ఇప్పటికీ ఎంతో సాన్నిహిత్యం ఉంది. అలాగే బాలు గారితో మా నాన్నకు మంచి స్నేహం. ఇద్దరూ చెన్నైలో పక్క ఇళ్లల్లో ఉండేవారు.



మాకు ఒకతే అమ్మాయి... ప్రసిద్ధ. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వయొలిన్ బ్రహ్మాండంగా వాయిస్తుంది. నేను, మావారు ఇప్పటికి మూడు వేల ప్రదర్శనల వరకు ఇచ్చివుంటాం. ఏటా అమెరికా వెళతాం. కచేరీలు, గెస్ట్ లెక్చరర్స్ ఇస్తాం. సంగీత తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. శోభానాయుడు గారికి పాతికేళ్లు పాడాను. ఆనంద్ శంకర్, స్వప్నసుందరి తదితర ప్రముఖ నాట్యకారులందరికీ నేనే పాడుతున్నాను. ఇవికాకుండా ఎన్నో కచేరీలు చేశాను. తమన్ గారు అడిగితే 'సర్కారువారి పాట' చిత్రంలోని 'కళావతి' పాటలో జతులు ఆలపించాను. నాని 'అంటే సుందరానికి' చిత్రం 'పంచె కట్టు' పాట తమిళం, మళయాళం వెర్షన్లు పాడాను. ఇంతకుమించి సినిమా పాటలు పాడలేదు.

పెద్దగా కోరికలు లేవు...

కొవిడ్ సమయంలో సంపాదన లేక కొన్ని రోజులు ఇబ్బంది పడినా... అమ్మవారి దయవల్ల మా జీవితం ఇప్పుడు సంతోషంగా సాగిపోతోంది. మాది పదహారు మంది ఉన్న ఉమ్మడి కుటుంబం. కోట్లు సంపాదించాలి... బెంజిలో తిరగాలనే కోరికలేవీ మాకు లేవు. ముప్ఫై ఏళ్లుగా పాడుతున్నాం. వచ్చిన డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాం. కారు ఉంది. ఇబ్బందులు లేకుండా సంసారం సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. ఒక మనిషి ఆనందంగా జీవించడానికి ఇంతకంటే ఏంకావాలి! చుట్టూ మన అనుకొనే మనుషులు... నాలుగు కచేరీలు ఉంటే చాలు మాకు."

• హనుమా

కాలేయాన్ని కాపాడుకుందాం!

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలో చేరిన విష పదార్థాలను, ఇతర వ్యర్థాలను తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినపుడు కాలేయం తనంతట తాను మరమ్మతు చేసుకుంటుంది. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఇందుకు సహకరిస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం.

వెల్లుల్లి

- ఇందులో సల్ఫర్‌తోపాటు అల్లిసిన్, సిలీనియం లాంటి రసాయన సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపేందుకు కాలేయంలో ఉత్పత్తయ్యే ఎంజైములు తయారీకి ఇవి తోడ్పడతాయి. వెల్లుల్లిని ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం ద్వారా కాలేయం పనితీరు మెరుగుపడుతుంది.

బీట్‌రూట్

- తరచూ బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అందులోని బీటాలైన్ సమ్మేళనాలు కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో ఉండే పలు నైట్రేట్‌లు కాలేయంలో వ్యర్థాలు పేరుకోకుండా చేస్తాయి.

గ్రీన్ టీ

- తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల కాలేయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తి నియంత్రణలో ఉంటుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలోని వ్యర్థాలను కరిగించి మూత్రం ద్వారా బయటికి వెళ్లేలా చేస్తాయి.

ఆకు కూరలు


- ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చేరిన భార ఖనిజాలు, పురుగు మందుల అవశేషాలు, ఇతర రసాయనాలను తొలగించడంలో కాలేయానికి సహాయం చేస్తుంది. ఆకుకూరలు, ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలను తరచూ తినడం వల్ల కాలేయంపై పని భారం తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్

- దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో చేరిన కొన్ని రకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. ప్రతిరోజూ తినే ఆహార పదార్థాల్లో ఆలివ్ ఆయిల్‌ను చేర్చుకోవడం వల్ల కాలేయంపై పని ఒత్తిడి తగ్గుతుంది.

ధనియాలు

- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా ధనియాలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగితే కాలేయంలో వ్యర్థాలు మిగలకుండా ఉంటాయి.



ధనియాల్లో ఉండే పీచు పదార్థాలు, ఫోలిక్ యాసిడ్‌లు ప్రభావవంతంగా పనిచేసి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి.

వాల్‌నట్స్

- వీటిలో ఒమేగా 6, ఒమేగా 3 ఫాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వులు పేరుకోకుండా చేస్తాయి. వాల్‌నట్స్ తినడం వల్ల వాటిలోని అర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరం నుంచి అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సహకరిస్తుంది.

బాదం

- బాదం పప్పులో ఇ విటమిన్ ఉంటుంది. ఇది కాలేయంలోని ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అయిదు బాదం పప్పులను నీటిలో నానబెట్టి తినాలి.

పండ్లు

- నిమ్మ, నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను తరచూ తినడం వల్ల శరీరానికి పుష్కలంగా సి విటమిన్ అందుతుంది. ఇది శరీరంలో చేరిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలేయానికి విశ్రాంతిని ఇస్తుంది. యాపిల్ పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే పెక్టిన్ అనే పీచు పదార్థం కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. నల్ల ద్రాక్షను జ్యూస్‌లా చేసుకుని తాగితే అందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి.

ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్. రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మార్చిలో మొదలు



మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.


తుదిదశలో చిత్రీకరణ



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్ షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.


నవ్య | చిత్రజ్యోతి

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అద్భుత ప్రయాణం ముగిసింది



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్‌ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్ళే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమిష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.

ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుశ్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజిని వాడారని.. అందుకోసం ధనుశ్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుశ్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేశ్. ధనుశ్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుశ్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్' (ఎంతవాడు కానీ) సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్ధాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుశ్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

అరసవల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకునే మనసున్న మారాజు ముఖ్యమంత్రి చంద్రబాబు అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో సింగుపురం గ్రామానికి చెందిన ఆవల వెంకయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంకయ్య అనారోగ్యంతో బాధపడు తున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే చంద్రబాబు స్పందించి రూ.1.60 లక్షల చెక్కును మంజూరు చేసినట్టు తెలిపారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల వద్ద మద్యాన్ని అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా రవాణా చేసిన కేసులు నమోదు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గా ప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత నెలలో జరిపిన దాడుల్లో 21 కేసులు నమోదు చేసి, 21 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో 134 మద్యం సీసాలు, 97 ఒడిశా మద్యం బీరు సీసాలతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. పాత కేసుల్లో పట్టుబడినవారిని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశామన్నారు.

15 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రణస్థలం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిసిని గ్రామ సమీపంలోని ఒక తోటలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 15 మంది పేకాటరాయుళ్లను పోలీసులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.33,480 నగదు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

ప్రజా వేదికను సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా సమస్యలు తెలియజేసి, రసీదు తీసుకోవాలన్నారు.

ఘనంగా తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి గ్రామ దేవత ధనరాజ తులసమ్మ తల్లి అమ్మవారి సంబరం ఘనంగా జరిపారు ఆదివారం అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పసుపు నీరుతో అభిషేకాలు జరిపి మొక్కులు చెల్లించారు.

హామీలకు తూట్లు

ఇచ్ఛాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి తనమార్కును చూపిస్తూ హామీలకు తూట్లు పొడిస్తున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. ఆదివారం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణలో వారు విలేకరులతో మాట్లాడారు. బాబు ష్యూరిటీ - వీర బాదుడు అనే నినాదంతో ముందకు వెళ్తున్నట్టు విమర్శించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని ప్రజలకు వాగ్దానం చేసి.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కారన్నారు.

సభ విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభ విజయవంతం చేయాలని రాష్ట్ర మఠమందిర్ ప్రాముఖ్ ఫల్గుణరావు పిలుపునిచ్చారు. ఆదివారం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం ప్రాంగణలో ప్రఖండ అధ్యక్షులు తులసీదాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. హిందూ పరిషత్ సభ్యులు రామ్‌ప్రసాద్, గవరయ్య, వీకే ప్రసాద్, అయ్యప్ప, హనుమాన్, శివ స్వాములు పాల్గొన్నారు.

తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో నెలవారీ సాహితీ సమ్మేళనం స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణ మూర్తి నిర్వహణలో ఆదివారం జరిగింది. తొలుత సంస్థ సభ్యులు, ఇటీవల మృతి చెందిన రచయిత్రి అయ్యంగారి సుమిత్రమ్మ ఆత్మకు శాంతిచేకూరాలని మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ, కవుల రచనలు చిరస్థాయిగా నిలిచిపోయేలా గ్రంథస్తం చేయాలని కోరారు. సంస్థ సభ్యులు కోమలరావు, ఇద్ది పాపయ్య, నిక్కు హరిసత్యనా రాయణ, ఐఎన్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కంచిలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 28, 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో కంచిలి గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలలో ఆదివారం నిర్వహించారు. వాలీబాల్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని, అలాగే 100మీటర్ల పరుగు పందెంలో కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థి ఆర్.యాదగిరి కాంస్య పతకం, లాంగ్ జంప్‌లో ఎస్.చరణ్ కాంస్య పతకం సాధించినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ బి.అప్పారావుతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గిరాకీ లేక.. సాయం అందక

- ఏళ్ల తరబడి రాళ్లు కొట్టి జీవనం
- కుటుంబపోషణ భారంగా మారిన వైనం
- ఇదీ ఎంఎస్ పల్లిలో గృహోపకరణాల తయారీదారుల పరిస్థితి



చిప్స్ కొడుతున్న మహిళ



సన్ని తయారు చేస్తున్న అమీన్‌బీ సయ్యద్

కంచిలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం చేతి వృత్తినే నమ్ముకున్న వారి బతుకుల్లో మార్పులు రావడంలేదు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేతితో చేసిన రాతి వస్తువులకు గిరాకీ లేకుండాపోయింది. దీనికితోడు ఈ వృత్తిపై ఆధారపడేవారికి ప్రభుత్వ సాయం అందని పరిస్థితినెలకొంది. ఇదీ కంచిలికి సమీపంలో ఉన్న ఎంఎస్ పల్లిలో ఏళ్ల తరబడి కొండ రాళ్లను సేకరిస్తూ.. వాటితో తిరగళ్లు, రోళ్లు, సన్నిలు వంటి గృహోపకరణాల తయారు చేస్తున్న ముస్లిము కుటుంబాల పరిస్థితి.

కంచిలికి సమీపంలో ఉన్న ఎంఎస్ పల్లిలో రాళ్లను సేకరించి వాటితో ఇళ్లల్లో ఉపయోగించే తిరగళ్లు, రోళ్లు, సన్నిలు తదితర సామగ్రిని తయారు చేసి పలు ముస్లిం కుటుంబాలు జీవిస్తున్నాయి. ఐదు దశాబ్దాల కిందట ఒడిశా నుంచి వలస వచ్చి ఇక్కడ వీరి పూర్వీకులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి సమీప కొండల్లోని రాళ్లను సేకరించి ఇళ్లల్లో ఉపయోగించే వస్తువులు తయారు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేస్తే తప్ప పోషణ భారంగా మారిందని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఇళ్లు మంజూరు చేయడంతోపాటు చేతి వృత్తులు అభివృద్ధి చేసుకునేందుకు తోడ్పాటు అందించాలని వారంతా కోరుతున్నారు. ఒకప్పుడు యంత్రాలతో తయారైన వస్తువుల కంటే చేతితో తయారు చేసిన వస్తువులకు గిరాకీ ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం గ్రైండర్లు, మిక్సీలు మార్కెట్లోకి రావడంతో రాతిలో చేసిన తిరగళ్లు, సన్నులు వినియోగం తగ్గిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిళ్లు, సంప్రదాయాల కోసం మాత్రమే వీటిని ఉపయోగిస్తుండడంతో తాము తయారీ చేసే సామగ్రి కొనుగోలు తగ్గిందని వీరంతా వాపోతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షకు విశేష స్పందన



గుజరాతీపేట: విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు, ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి/ గుజరాతీపేట/ ఆమదాల వలస/ సోంపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రీకాకుళం, ఆమదాలవలస, సోంపేటలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. ఈ పరీక్ష రాసేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. అరసవల్లిలోని పీఆర్‌టీయూ భవనంలో జరిగిన పరీక్షకు 400 మంది హాజరయ్యారు. ఆమదాలవలసలో నిర్వహించిన పరీక్షకు 502 మంది, సోంపేటలో జరిగిన పరీక్షకు 468మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు షీల్డ్‌ను బహూకరించారు. అరసవల్లి పీఆర్‌టీయూ భవనంలో నిర్వహించిన పరీక్షను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, తద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని అన్నారు. మూడుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఎంఈవోలు మాధవరావు, ఎస్.శివరాం ప్రసాద్, చిట్టిబాబు, పీఆర్‌టీయూ నాయకులు పప్పల రాజశేఖరరావు, దానేటి కేశవరావు, ఎ.మాధవరావు, కె.సత్యనారాయణ, బొడ్డేపల్లి గోపీచంద్, వడ్డాది గోపి కృష్ణ, దాలిబందు, శరత్‌బాబు, రమేష్ పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

ఎయిడ్స్ నివారణపై అవగాహన తప్పనిసరి

- డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో మీనాక్షి మాట్లాడుతూ.. హెచ్ఐవీ సోకినవారు క్రమం తప్పకుండా మందులు వాడాలని, ప్రోటీన్స్‌తో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నవారితో ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సంఘ సేవకులు మంత్రి వెంకట స్వామి, బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షుడు ప్రసాదరావు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ పోలినాయుడు, కాలేజి విద్యార్థులు, యువత, నర్సింగరావు, చిన్మయిరావు, గొలివి రమణ, సతీష్, సుజాత ఉమాశంకర్, రెడ్‌క్రాస్, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే పీడీయాక్ట్ ప్రయోగించండి

ఆమదాలవలస (బూర్జ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మద్యం నిర్వహణ నూతన పాలసీకి తూట్లు పొడిచేలా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే పీడీయాక్ట్ ప్రయోగించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అధికారులు ఆదేశించారు. ఆదివారం బూర్జ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో తిరుపతిరావు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తుండగా.. పలువురు సభ్యులు సహకార అవినీతి, ధాన్యం కొనుగోలు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో సహకార సంఘంపై సమగ్ర విచారణ జరిపించేలా తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఖరీఫ్ సాగు చేసే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఫెంగల్ తుఫాన్ నష్టం నుంచి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని అధికారురులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయించాలన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణం నాయుడు, జడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేహాకు సీపీ రావు మెమోరియల్ అవార్డు



అవార్డు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కూచిపూడి నృత్యకారిణి డి.నేహాకు సీపీ రావు మెమోరియల్ అవార్డు అందుకున్నారు. గత నెల 30న హైదరాబాద్ శిల్ప కళా వేదికలో జరిగిన నాట్యతోరణం సందర్భంగా అమృత కల్చరల్ ట్రస్ట్ వారు ఈ అవార్డును ప్రదానం చేశారు. సీపీ రావు మెమోరియల్ ట్రస్ట్ ఎండీ సీతా ఆనంద్, రేవతి భూపాల చేతుల మీదుగా జ్ఞాపిక, ధ్రువపత్రంతోపాటు రూ.25,000 అందజేశారు. ఈమె నగరానికి చెందిన నృత్య గురువు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యురాలు.

ఆదిత్యుని సన్నిధిలో ఎమ్మెల్సీ చిరంజీవి



ఎమ్మెల్సీకి జ్ఞాపికను అందిస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి ప్రసాదాలను, స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ అందజేశారు. ● కాగా ఆదివారం ఒక్క రోజు స్వామివారికి రూ.3,03,073 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.66,000, పూజలు, విరాళాల రూపంలో రూ.38,938, ప్రసాదాల ద్వారా రూ.1,98,135 లభించినట్టు ఆలయ ఈవో భద్రాజీ తెలిపారు.

అలరించిన కోలాటం

ఇచ్ఛాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవ స్థానం తిరుచనూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో టి.బ రంపురం గ్రామానికి చెందిన అసిరమ్మతల్లి కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం అందర్నీ అలరించింది. చిన్నారుల కోలాటానికి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారని ప్రముఖ జ్ఞానపద సంగీత కళాకారుడు తిప్పన దుర్యోధనరెడ్డి తెలిపారు.



పద్మావతి దేవాలయంలో చిన్నారుల కోలాటం

ఆదిత్యాలయంలో సంగీత నీరాజనం



అరసవల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం కృష్ణవేణి సంగీత నీరాజనం వైభవంగా జరిగింది. కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నర సన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆలయ అనివెట్టి మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంగీత విదుషీమణి మండ సుధారాణి బృందం ఆలపించిన వాతాపి గణపతిం భజే, ఎందరో మహానుభావులు వంటి కీర్తనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, అరసవల్లి దేవస్థానం ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జిల్లా పర్యాటకాధికారి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. మావుడూరు సత్యనారాయణ శర్మ (వయోలిన్), ఎం.శ్రీధర్ (మృదంగం), మావుడూరు సూర్య ప్రసాద్ (ఘటం) వాద్య సహకారాన్ని అందజేశారు.

కార్తీకవన సమారాధనతో సామాజిక ఐక్యత



ఎన్ఈఆర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పొందూరు, డిసెంబరు 1(ఆంధ్ర జ్యోతి): కార్తీక వనసమారాధన వంటి కార్యక్రమాలు సామాజికవర్గం ఐక్యతకు దోహదపడతాయని ఎచ్చర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వర రావు అన్నారు. బొట్లపేట ఎండలమల్లికార్జునస్వామి ఆలయం వద్ద పొందూరు, జి.సిగడాం మండలాల కమ్మ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తక వనసమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఈఆర్‌తో పాటు సామాజికవర్గ పెద్దలు, కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రమాణాలు పాటించాలి

గుజరాతీపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో పౌరులకు అందిస్తున్న సేవల్లో కనీస ప్రమాణాలు పాటించకపోవడం వల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రైతు బజార్ దరిలోగల రిటైర్డు ఉద్యోగుల సమావేశ మందిరంలో ఆదివారం స్వచ్ఛ సుందర శ్రీకాకుళ సాధన సమితి ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయ కుండా తండ్యావలస వద్ద డంపింగ్ చేయడం దారుణమన్నారు. డాక్టర్ సుబ్బారావు, వంగా మహేష్, అర్జు నరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కళలను కాపాడుకుందాం

ఆమదాలవలస, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కళలను కాపాడుకుం దామని కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టికి త్రినాథరావు అన్నారు. ఆదివారం పట్టణ శివారున నాలుగో వార్డు పరిధిలోని గేదెలవానిపేట వద్ద కార్తీక వన సమారాధన నిర్వహించారు. కళలు జనాన్ని జాగ్రత్తం చేస్తాయన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ.. కళాకారులందరూ సభ్యులుగా చేరి సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. జనార్దనరావు, ధనుంజయరావు, లక్ష్మణరావు, సంజీవరావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

పశు సంపద వివరాలు ఇవ్వండి

- పశు సంవర్థకశాఖ ఏడీ బాలకృష్ణ



పొందూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్యూమరేటర్లు సమాచార సేకరణకు ఇంటికి వచ్చే సమయంలో రైతులు తమకున్న పశు సంపదపై సమగ్ర సమాచారం ఇవ్వాలని పశుసంవర్థకశాఖ ఏడీ పీఎస్‌జీ బాలకృష్ణ కోరారు. 21వ జాతీయ పశుగణనపై 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: పశుగణన వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉన్నాయి?

జవాబు: గ్రామీణ భారతంలో పశువుల పెంపకం కీలకం. ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతుంది.

ప్ర: పశుగణన రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతుంది?

జ: పశు సంవర్ధక రంగంపై ఆధారపడిన రైతు కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా కార్యక్రమాలు రూపొందించడానికి, పశుసంపదపై ఆధారపడిన రైతు, ఇతర కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఉపయోగపడుతుంది.

ప్ర: పశుగణన ఏ అంశాలపై ఆధారపడి ఉంటుంది?

జ: 16 రకాల జాతులపై జరుగుతుంది. అన్నిరకాల గో జాతులు, గేదెలలో రకాలు, గొర్రెలు, మేకలు, కోళ్ల జాతులు, పెంచుకున్న, వీధికుక్కల పైనా పశు గణన జరుగు తుంది.

ప్ర: పశుగణన ఎన్ని సంవత్సరాలకు జరుగుతుంది?

జ: దేశంలో పశుగణన ప్రతి ఐదేళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి నిర్వహిస్తారు.

ప్ర: ప్రస్తుతం పశుగణన ఎప్పటినుంచి జరుగుతుంది?

జ: దేశంలో ప్రస్తుతం 21వ జాతీయ పశుగణన జరుగుతోంది. అక్టోబరు 25న ప్రారంభం కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుంది.

ప్ర: మండలంలో ఎన్ని ఇళ్లల్లో పశుగణన నిర్వహించనున్నారు. ?

జ: 38 రెవెన్యూ గ్రామాల్లో ఎనిమిది మంది ఎన్యూమరేటర్లు 19,242 ఇళ్లల్లో పశు గణన నిర్వహిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రహదారిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అశోక్

సోంపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పొత్రఖండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం సుమారు రూ.6 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో బి.నరసింహమూర్తి, కూటమి నాయకులు సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, చిత్రాడ శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆదర్శప్రాయులు సీతారాములు

పొందూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీత, రాముడు నేటితరానికే కాకుండా భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయులని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త టి.వెంకటరమణ అన్నారు. లైదాం శివానంద ధర్మక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సత్సంగమాధురి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆశ్రమ నిర్వాహకులు గొర్లె అనంతరామకృష్ణ మాట్లాడుతూ.. తమ చేతలతో ప్రపంచానికి అందించిన సంప్రదాయం వారిని అనుసరించేలా చేస్తోందన్నారు. ప్రతీ ఒక్కరూ శ్రీమద్రామాయణాన్ని పఠించాలన్నారు. ఆధ్యాత్మికవేత్తలు వై.శ్రీనివాసరావు, ఎన్‌వీ రమణ, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 11 మంది రామదీక్షలు తీసుకున్నారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


వేణుగోపాలరావు మృతదేహం

నరసన్నపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బొరిగివలస సుబ్బారావు కాలనీలో అత్తవారి ఇంటి వద్ద గంగరాపు వేణుగోపాలం (35) ఉరి వేసుకుని మృతి చెందాడు. ఎస్‌ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొన్నాళ్ల కిందట తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం యార్లపూడికి చెందిన వేణుగోపాలరావుతో సుబ్బారావు కాలనీకి చెందిన ధనలక్ష్మితో రెండో వివాహమైంది. అక్కడ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడునెలల కిందట భార్య ధనలక్ష్మితో కలిసి వేణుగోపాలరావు ఆమె కన్నవారి ఇంటికి వచ్చి ఉంటున్నాడు. ఆదివారం ఉదయం భార్య లేని సమయంలో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను స్నానం కోసం కాలువకు వెళ్లిన సమయంలో భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. మృతుడికి, ఆమెకు కూడా రెండో వివాహమే. ధనలక్ష్మికి తొలి సంబంధానికి ఒక కుమార్తె, మృతుడికి తొలి సంబంధానికి ఇద్దరు కుమారులున్నారు. వీరు మృతుడి తండ్రి వద్ద యార్లపూడిలో ఉంటున్నారు. ఈ మేరకు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈమేరకు మృతుడి తండ్రికి సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణాకు చెక్


పోలాకిలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపడుతున్న సీఐ, ఎస్‌ఐ

నరసన్నపేట/పోలాకి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, వినియోగానికి చెక్ పెట్టేందుకు గాను చర్యలు తీసుకుంటున్నామని సీఐ జె.శ్రీనివాస రావు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్, మడపాం టోల్ ప్లాజా, దాబాలు, పాన్‌షాపలు, పోలాకిలోడాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు అనుమానిత ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపడుతున్నామన్నారు. ఒడిశా నుంచి దిగుమతి లేకుండా ఉండేందుకు బస్సులు, వాహనాలను సైతం తనిఖీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, రంజిత్, ఏఎస్‌ఐ కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు విద్యార్థుల సాయం



పలాస, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనాథలకు సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు ఆదివారం ఆహార పదార్థాలను అందించారు. ప్రతినెలా పోకెట్ మనీని దాచు కుని పేదలకు భోజనం అందిస్తూ సత్యసాయి సూక్తిని ఆచరిస్తున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఉండే యాచకులకు మధ్యాహ్నం భోజన పొట్లాలు అందించి పెద్ద మనసు చాటుకున్నారు.

ఎమ్మెల్యే శిరీషను కలిసిన డీఎస్పీ



పలాస, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గౌతు శిరీషను కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తరువాత ఆమెను కలియడం ఇదే తొలిసారి. అసెంబ్లీ కార్యక్రమాల తరువాత ప్రభుత్వ ఆదేశాలపై దుబాయ్ వెళ్లిన ఆమె శనివారం పలాస వచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా పలాస డివిజన్‌లో సేవలు పెంచాలని ఆమె డీఎస్పీకి సూచించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


ప్రసంగిస్తున్న శ్రీనివాసానంద సరస్వతి

నందిగాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. ఆదివారం దిమ్మిడిజోలలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా అఖండ హరినామ సంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సత్సంగంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ఐక్యత సిద్ధిస్తుందన్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో ఊడికిలపాడుకు చెందిన ప్రవచనకర్త కరుణాకర్, వీహెచ్‌పీ ప్రతినిధి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జోనంకి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిశ్చంద్రపురానికి చెందిన హెచ్.కృష్ణదాసుకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. సారవకోట నుంచి చల్లవానిపేట వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తికి చల్లవానిపేట నుంచి సారవకోట వెళుతున్న వ్యాను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకొని క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం నరసన్నపేట ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్లు 108 పైలెట్ గోవింద తెలిపారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని హెచ్‌సీ రాజశేఖర్ తెలిపారు.

పూర్తయ్యేదెప్పుడో?

- ఏళ్ల తరబడి నిర్మాణ దశలోనే..
- అసంపూర్తిగా ఆసుపత్రి భవనాలు


అసంపూర్తిగా ఉన్న ఆసుపత్రి అదనపు భవనాలు

కొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అదనపు భవనాల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న భవనాల్లో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. కొత్తూరుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరై అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్థల పరిశీలన చేసి పనులకు శంకుస్థాపనకు సిద్ధంచేస్తున్న సమ యంలో సీతంపేటకు తరలి పోయింది. ఆ తరువాత 30 పడకల సామాజిక ఆసుపత్రి భవనాల అదనపు గదుల కోసం 2020 అక్టోబరులో పనులు ప్రారంభించారు. ఏడాదిన్నరకు అందుబాటులోకి రావాల్సి ఉన్నా నేటికి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ భవనాలు పూర్తి కాలేదు. దీంతో కొత్తూరు సామాజిక ఆసుపత్రికి వచ్చే కొత్తూరు, భామిని, సీతంపేట మండలాల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మండలాలతో పాటు ఒడిశాకు చెందిన రోగు లు నిత్యం ఆసుపత్రికి వస్తుండడంతో సుమారు 200 ఓపీ నమోదవుతున్నప్పటికీ అదనపు భవనాలు అందుబాటులోకి రాక పోవడంతో రోగులు, సిబ్బంది తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వసతులు కొరతతో వరండాలో చికిత్స నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు, రోగుల సహాయకులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఎంపీడీవో కార్యాలయం


పనులు నిలిచిపోయిన దృశ్యం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండల పరిషత్ కార్యాలయ నూతన భవనాల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గౌతు శివాజీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.90 లక్షలతో కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొంతమేర పనులు జరగ్గా ఆ తరువాత ప్రభుత్వం మారి వైసీపీ అధికారం లోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి అచ్చెన్నాయుడు


మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన మూలపేట రైతులు

కోటబొమ్మాళి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సమస్యలను విడతల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ముఖ్యంగా గ్రామాల్లో సాగు, తాగునీరు, రోడ్లు, కాలువల తదితర సదుపాయాల కల్పనకు చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నాయో వాటిని గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేసి తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్య క్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవింద రాజులు, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, బోయిన రమేష్ పాల్గొన్నారు.

మూలపేట పోర్టు నిర్వాసితులను ఆదుకోండి

టెక్కలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు నిర్వాసిత రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు. ఆదివారం నిమ్మాడలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి సమస్యల ను విన్నవించారు. 40 మంది రైతులు 45 ఎకరాల భూమిని పోర్టుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, న్యాయం చేయాలని మూలపేట గ్రామానికి చెంది న కోట నారంనాయుడు, జీరు సుందర రావు, సుగ్గు సింహాచలం, కోట మోహన రెడ్డి, చెన్న కేశవరెడ్డి తదితరులు కోరారు.

ఆలయాభివృద్ధికి సహకరించండి

సంతబొమ్మాళి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మరు వాడ పంచాయతీ గుడ్డిమీదపేట గ్రామంలోని పురాతన విఘేశ్వర ఆలయాభివృద్ధికి నిధులు కేటా యించాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు, రాష్ట్ర మంత్రి అచ్చెనాయుడును కోరారు. సర్పంచ్ సూ రాడ ధనలక్ష్మి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి దాసు రాజు ఆదివారం వినతపత్రం అందజేశారు. అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మంత్రిని కలిసిన ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు శనివారం మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషలను మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం తనను గుర్తించి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. నౌపడా నుంచి పూండి రోడ్డును విస్తరించాలని వారిని కోరినట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన రావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంఈవో కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పోలాకి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎంఈవో యారబాటి వాసుదేవరావు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం వెదుళ్లవలసలోని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో తెలుగు నాగేశ్వరరావు, ఎంఈవోలు శ్రీనివాసనాయక్, లింగరాజు తదితరులు పాల్గొని సంతాపాన్ని వ్యక్తంచేశారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో మోడల్ ప్రవేశ పరీక్ష

పాతపట్నం డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలాంధ్రరోడ్‌లోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) మోడల్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ.గోవిందరావు, ఆ సంఘం నేతలు ఆర్.మధు, ఎ.జనార్దన రావు, హెచ్‌ఎంలు బి.రామ్మూర్తి, సీహెచ్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.
- సంతబొమ్మాళి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ అధ్వర్యంలో బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ మోడల్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిం చారు. ఈ మోడల్ పరీక్షకు మండలంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, పీఆర్టీయూ నేతలు బాడాన రాజు, త్రినాథరావు, తవిటరెడ్డి పాల్గొన్నారు.
- జలుమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు ప్రతిభా పరీక్షలు దోహదపడతాయని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఎన్ ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు డోల గణపతిరావు, హెచ్‌ఎంలు ఇప్పిలి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

7న సుబ్రహ్మణ్య షష్టి పూజలు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివసాగర్‌బీచ్‌లో వెలసిన శ్రీనీలకంఠేశ్వర ఆలయంలోని సుబ్రహ్మణ్య సన్నిధిలో ఈనెల 7న షష్టి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మడ్డు నాగేశ్వర్రావు తెలిపారు. ఆదివారం ఆలయ సన్నిధిలో కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు ఉచితంగా న్యాయసేవలు



కోటబొమ్మాళి: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత

కోటబొమ్మాళి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటుకునే వ్యాధి అని, దీనిపై అవగాహన పెంచుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎం ఆర్ ప్రసన్నలత అన్నారు. ఆదివారం జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎయిడ్స్ రోగులకు కూడా ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని, వినియోగించుకోవాలని కోరారు. కార్య క్రమంలో న్యాయవాదులు లఖినేని శ్రీనివాస్, దుంపల నరసింహమూర్తి, సంపతిరావు తిరుపతి, వెలమల అప్పలనాయుడు, చింతాడ వెంకటరావు, ఎండ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: డిగ్రీ కళాశాల, పోలాకి: గంగివలస కేజీబీవీలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినీ విద్యార్థులు

సోమయ్యపేటలో పులి జాడ

జలుమూరు, (సారవకోట) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమయ్యపేట గ్రామం వద్ద పొలాల్లో ఆదివారం పులి పాద ముద్రలు కనిపించడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం జమచక్రం ప్రాంతంలో పులి సంచరించగా ఆదివారం సోమయ్యపేట, సింగం వలస గ్రామాల్లో సంచరించినట్లు స్థానికులు పేర్కొన్నారు. వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. వెంటనే అటవీ శాఖ బీట్ అధికారి డి.శివప్రసాద్ సదరు ప్రాంతాన్ని పరిశీలించి పులి పాదముద్రలే అని నిర్ధారించారు. ఉదయం పరిసర ప్రాంతాల్లోని కొండల్లో దాక్కొని రాత్రి సమయంలో పొలాల్లో సంచరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అటవీశాఖ అధికారులు అప్రమత్తమై సోమయ్యపేట, సింగంవలస గ్రామాల్లో పర్యటించి పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నందును ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో సంచరించిన పులి సారవకోట మండలంలో తిష్ట వేయడంతో ఎప్పుడు, ఏమవుతుందోనని పరిసర గ్రామాల ప్రజలు భాయందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి పులి నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పాతపట్నం పరిధిలో కలకలం

పాతపట్నం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బోరుభద్ర గ్రామానికి ఆనుకొని ఉన్న కొండ దిగువ భాగంలో పెద్ద పులి సంచరిస్తూ ఆదివారం కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారు. అటవీ శాఖాధికారులు ఆదివారం రాత్రి గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించి అప్రమత్తం చేశారు. ఒంటరిగా తిరగవద్దని, పశువులను రక్షించుకోవాలని కోరారు. పాత పట్నం ఫారెస్ట్ రేంజర్ పట్ట అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం వరకు సారవకోట మండలంలో సంచరించినట్లు గుర్తించారన్నారు. అయితే ఆదివారం గురం డి, బోరుభద్ర గ్రామాల్లో సంచరించినట్లు బోరుభద్రకి చెంది న మజ్జి రామారావు, డోల రజని, అంగూరు ఎల్లయ్య తదితరులు చెబుతున్నారు. పెద్దపులి గ్రామంలో ప్రవేశించ కుండా గ్రామస్థులతో కాపలా కాస్తున్నారు.


సోమయ్యపేట వద్ద పరిశీలిస్తున్న అటవీ అధికారులు, ఇన్‌సెట్‌లో పులి పాదముద్రలు


పాతపట్నం: బోరుభద్ర గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

న్యూస్ బాక్స్

నేడు ఆసుపత్రి సలహా కమిటీ సమావేశం

నరసన్నపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వంద పడకల ఆసుపత్రి సలహా కమిటీ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలు నిర్వహిస్తున్నట్లు కమిటీ కన్వీనర్ డా. శ్రీనివాసుబాబు ఆదివారం తెలిపారు. కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో జరుగు సమావేశానికి అధికారులు, వైద్యులు హాజరు కావాలని కోరారు. సభ్యులుగా శిమ్మ జగన్నాథం, మాదిన నల్లాన శాస్త్రి, డా.నిక్కు పద్మావతిలను నియమించినట్లు పేర్కొన్నారు.

హామీలను నేరవేర్చండి

నరసన్నపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండుసార్లు ట్రూఅప్ పేరిట విద్యుత్ చార్జీలు పెంచడం తగదన్నారు. ప్రజల తరఫున ప్రతిపక్షంలో ఉంటూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

నందిగాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో సంఘ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా ముక్కు కూర్మాచారి, గౌరవాధ్యక్షుడిగా విశాకోటి నీలాచలం, ప్రధాన కార్యదర్శిగా శాసనపురి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రాయల మోహనరావు, బండారి శంకరరావు, కోశాధికారిగా బండారి విశ్వనాథంలను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా తామాడ శ్రీను, పట్నాన ధర్మారావు, ఎం.శంకరరావు ఎన్నికయ్యారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మందస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మందసలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌పండా ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు కేజీబీవీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

మెళియాపుట్టి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశా లలో పనిచేసేందుకు కుక్, అసిస్టెంట్ కుక్, చౌకిదీరు పోస్టులకు గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఎస్.దేవేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికేట్లతో మంగళవార ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

రైలు ప్రయాణికులకు అవగాహన

పలాస, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై రైల్వే ప్రయాణికులకు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1098, 139 టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే జీఆర్పీ హెచ్‌సీ మెట్ట సోమేశ్వరరావు మాట్లాడుతూ.. రైలు ప్రయాణాల్లో బాలబాలికలు తారసపడితే తమకు తక్షణం సమాచారం అందించాలన్నారు. బాలికల అక్రమ రవాణా నేరమని, వారితో పనులు చేయించడం చట్టవిరుద్ధమన్నారు. పిల్లలతో భిక్షాటన, అక్రమ రవాణా, తప్పిపోయిన వారు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగిస్తున్నామని ఆయన తెలిపారు.

బోగస్ కార్డులు, పింఛన్లు తొలగించాలి


కోటబొమ్మాళి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో బోగస్ కార్డులు, అనర్హులకు పింఛన్లు ఉన్నాయని, వాటిపై విచారణ చేపట్టి తొలగించాలని మాజీ సైనిక అధికారి, బీజేపీ జిల్లా సైనిక్ సెల్ కన్వీనర్ మెట్ట మన్మథరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓటు కోసం అర్హత లేకపోయినా కార్డులు, పింఛన్లు అందిస్తున్నాయని, వాటిని తొలగించి అర్హు లకు అందించాలని కోరారు. చాలా పంచాయతీల్లో పెద్ద కుటుంబాలకు రేషన్ అందించడం వల్ల వారు బయట విక్రయిస్తున్నారని, ఇదే రేషన్ మాఫియా అని అన్నారు. ఇటువంటి వాటిని తొలగించాలని కోరారు.

హమ్మయ్య!

- రోడ్ల మరమ్మతులతో హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు
- ఐదేళ్ల తరువాత గుంతలకు మోక్షం

మెళియాపుట్టి/జలుమూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో ప్రయాణికులు, వాహనదారులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఏ గ్రామం చూసినా, ఏ పట్టణం చూసినా గతుకుల రోడ్లే దర్శనమిచ్చాయి. గోతులకు తోడు భారీ వర్షాలు సైతం కురవడంతో గోతుల్లో వాహనాలు దిగబడి మరమ్మతులకు గురికావడంతో పాటు వాహనదారులు గాయాలబారిన పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుంతలను కప్పి రోడ్లు మరమ్మతులు చేపడుతుం డడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెళియాపుట్టి, జలుమూరు మండలాల్లోని పలు గ్రామాల రహదారులైఉన్న గోతులను పూడ్చి మరమ్మతులు చేపడుతుండడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్లు నరకాన్ని అనుభవించామని, ప్రస్తుతం ఆనందంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


జలుమూరు: కరవంజ వద్ద గోతులు కప్పి మరమ్మతులు చేసిన రోడ్డు



మెళియాపుట్టి: చాపర వద్ద నాడు.. నేడు

పండగలా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించండి



పాతపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పండగ వాతావరణంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఈనెల 7 నుంచి నిర్వహించనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిమిత్తం ఆయన రూ.50 విరాళాన్ని ఆదివారం హెచ్‌ఎం సనపల వైకుంఠరావుకు అందించారు. మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జవ్వాది ఈశ్వరరావు, జవ్వాది సవరయ్య, ఎస్‌ఐ బి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో డీపీవో

జలుమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వర స్వామిని జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భారతి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు, దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఈవో పి.ప్రభాకరరావు, సర్పంచ్ టి.సతీష్ కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.